# రాయాల్సిన కథ

పెట్టెలో ఆఖరి సిగరెట్టు ముట్టించుకో బోయారు విశ్వనాథంగారు. చటుక్కున వెలిగి ఆరిపోయింది అగ్గిపుల్ల. మరో పుల్ల తీయబోయి ఖాళీ అగ్గిపెట్టె చూసుకుని సిగరెట్టు పెట్టెలో పెట్టేశారు.

“నమస్కారం గురూగారూ!....తీరికగా కూచున్నారు...లెర్నర్స్ ఎవరూ రాలేదా?”

రోడ్డుమీద వెళుతూ ఓ ఆయన విశ్వనాథంగారిని పలకరించాడు.

“ఆటలవుతున్నాయట అయోధ్యా మైదానంలో, అక్కడికి పోయారు...అవిటివాడిని అరుగుమీద కూచున్నా...అగ్గిపెట్టె ఉందా? అన్నట్టు నువ్ సిగరెట్టు కాల్చవు కదూ?”

“లోపలికెళ్లి తెస్తాలెండి!”

“వద్దులే...అది మడిలో ఉంటుంది...కాసేపు ఆగుతాలే...అవునోయ్ ప్రసాదూ....ఈ మధ్య కనబడడం లేదు. కమాను వెళ్లావా?”

“కమానూ లేదు పాడూలేదు. ఇంటింటా తిరిగి ఓటర్ల జాబితా రాయమన్నారు. ఉపాధ్యాయ వృత్తి అన్న తరువాత మామూలు మనుషులు కంటే మాలో సామాజిక స్పృహ ఉండాలిగా...”

“రచయితవనిపించుకున్నావ్ సుమా...”

“ఇదిగో అగ్గిపెట్టె!” లోపలి నుంచి సోమిదేవమ్మగారు అందించారు.

“నమస్కారం అమ్మగారూ!”

“ఆశీర్వాదం నాయనా...”

“నేనెటూ బజారుకే బయలుదేరాను...కూరగాయలేమైనా కావాలా?”

“ఏం అక్కరలేదులే...”

సంచి ఊపుకుంటూ మెట్లు దిగుతున్న ప్రసాదుకి మనసులో ఏదో మెదిలింది. ఆయన అవిటివాడు...డయబెటిక్ గాంగ్రీన్ అయితే నలభైవ ఏటనే కాలు తొడవరకూ తీసేశారు. ఉద్యోగం పోయింది. ప్రకృతిని నమ్ముకొని ఆ చికిత్సా విధానం పాటిస్తూ పిల్లలని ఎవరంతటి వాళ్లని చేసేసి భార్యాభర్తలిద్దరూ చల్లగా సంసారం చేసుకుంటున్నారు.

విశ్వనాథం పిల్లల డబ్బుమీద ఆశపడే మనిషి కాదు. తనకు ఒక కాలు లేకపోయినా, రెండో కాలు పనికి రాకపోయినా ఎప్పుడూ ముఖంలోకి విషాదం తొంగి చూడనియ్యకుండా హుందాగా, ఆనందంగా బ్రతుకుతున్నారు. నుదుటన విభూతి పిండికట్లు, కుంకుమ బొట్టు... నవ్వుతూ ఆత్మీయుల్లా అందరితో మాటాడుతారు.

ఆయన భార్య సోమిదేవమ్మ మాటలనిండా ఆత్మీయతే. ముఖంలో ఎప్పుడూ ప్రసన్నతే. ఆవిడ కష్టాలు తెలిసిన వాళ్లకి ఎంత కష్టం కలిగించినా ఆవిడకేం కష్టం కలిగించవేమో. చూసేవాళ్లెవరైనా ఆవిడ అలాంటి కష్టాలను ఎలా మోయగలుగుతుందన్న ప్రశ్న వేసుకుంటే కాసేపటికి ఆవిడ స్థైర్యం వెనుక ఉన్న బలం ఆమె పాతివ్రత్యమని తేటతెల్లమై మన పురాణాలలోని, ఇతిహాసాలలోని

పతివ్రతలమీద గౌరవం కలుగుతుంది. అంతకు ముందే ఉన్నవాళ్లకయితే ఇనుమడిస్తుంది. తృప్తికీ, ఆనందానికీ భౌతిక భోగభాగ్యాలకీ సంబంధం లేదని ఋజువుచేసే వారి దాంపత్యం వెలుగున వెదజల్లుతుంది.

ప్రసాద్ కూడా ఓనాడు ఆయన దగ్గర షార్ట్‌హాండ్ నేర్చుకోవాలనుకున్నవాడే... నేర్చుకున్నవాడే!

కంపెనీలో స్టెనోగా పనిచేసి రోగంతో అవిటి వాడయి, ఉద్యోగం పోగొట్టుకున్న విశ్వనాథం తన విద్యనే నమ్ముకున్నారు. తెల్లవారిన దగ్గర నుంచి రాత్రి ఎనిమిదింటివరకూ షార్ట్‌హాండ్ నేర్చుకొనే పిల్లలు వస్తూనే ఉంటారు. లేదన్న చింతలేకుండా, అవిటిననే ఆరాటం లేకుండా, జీవితం గడుపుకొస్తున్న మనిషి.

బజారు నించి తిరిగొచ్చి ఓటర్ల జాబితా రాసుకుంటుంటే ఏవో రాయాలనిపించి...కాగితం మీద నాలుగు ముక్కలు కథకి మూస రాసుకున్నాడు ప్రసాద్. వికలాంగుల సంవత్సరం...ప్రభుత్వం మాటలు... మాయ...మీడియా గోల...జోల...అవిటివాళ్ల యావ...

మూస మనసులో మెదులుతోంది...మూసలో ప్రాణం పొయ్యాలనుకుంటూ హనుమాయమ్మ భర్త సాంబశివరావు స్త్రీ అరవై మూడు - తరువాత మరొకటి - మరొకటి. మూసకాస్తా ముక్కలయి పోయింది. కలలో నించి ఎగిరిపోయింది. స్కూలు పాఠం-ప్రైవేటు..జాబితా...పాతిక వాట్ల వెలుతురు.

పేరు కింద పేరు. పేరు కింద పేరు. ఓటర్ల జాబితా...ఇది ప్రజాస్వామ్యానికి వెన్నెముక...మరో పేరు...

"ఏవండీ! ఆవిడ...పిన్నిగారొచ్చారు..."

"ఎవరే పిన్నిగారు...."ప్రసాద్ తల పైకెత్తి టేబిలుమీద అలారం వాచీ ముఖం చూశాడు. తొమ్మిది కావస్తోంది.

టేబిలు కుర్చీ కంటే ప్రసాదుకి నేలే బావుంటుంది. నేలమీద ఉండడమే ఘనతన్న భావనొకటి...కుర్చీ నేలకంటే ఎత్తన్న భయమొకటి.

"ఆ రండి! రండి ఇంత చీకటిలో వచ్చారు!"

"వీధి దీపాలు అన్నీ వెలుగుతున్నాయి...ఏంలేదు నాయనా..ఆ నాలుగో వీధి కమ్యూనిటీ హాలుకు రేపు సాయంకాలం మేష్టరుగారిని రమ్మన్నారట...నువ్....నేనూ వస్తాననుకో...కొంచెం సాయం...."

"వివరాలు మాష్టారినే అడుగుతా ఉండండి!" ప్రసాద్ లేచి చొక్కా తొడుక్కొని బయలుదేరాడు...

"వికలాంగుల సంవత్సరం కదా...రేపు వికలాంగుల దినమట. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ నన్ను కలెక్టరుగారు అక్కడికి రమ్మన్నారని చెప్పాడు. కాగితం పెట్టమంటే పెట్టాను...ప్రభుత్వం మా కోసం చేస్తున్నది వద్దనడమెందుకు, పాతికోపరకో ఇస్తారేమో, ఫోటోలట - డాక్టర్ సర్టిఫికేట్లు అన్నీ పంపించాను ఓ శిష్యుడు వచ్చి చెబితే...నీకు అయిదింటికి తీరిక అవుతుందా?"

"తప్పకుండా మాస్టరూ....నేనో పావుగంట ముందేవచ్చి మిమ్మల్ని తీసుకెళతాను."

ఇంటికివచ్చి తను రాసిన కథ మూస చూసుకున్నాడు. సామాజిక స్పృహతో నిద్దరొచ్చి లైటార్పి పడుకున్నాడు.

మరుసటి రోజు సాయంకాలం స్కూలు నుంచి నేరుగా మాస్టారు ఇంటికే వెళ్లాడు. ఆయన

గదిలోంచి అరుగుమీదికి, మెట్లకిందకీ డేక్కుంటూ వచ్చి రిక్షా మీద కూచోబెడితే కూచున్నారు.

కమ్యూనిటీ హాలు ముందు కార్లూ, కోలాహలం. హాల్లో కుర్చీలు వేయించి అనేక రకాల వికలాంగులను బొమ్మల కొలువులా పేర్చారు.

వేదిక మీద కలెక్టరుగారూ, అధికారులూ, పెద్దలూ, వికలాంగుల కష్టాలూ, వారి ఎడల సమాజం యొక్క బాధ్యతా, ప్రభుత్వం వారి ఆరాటం ప్రసంగాలయ్యాయి.

ఎవరో ఓ చీటీ ప్రసాద్‌కి అందించారు మేష్టారు కియ్యమని. అది ప్రసాదే ముందు చూశాడు. మీరు మాట్లాడాలని మనవి

"కలెక్టరుగారిచ్చారట మీకు" ప్రసాదు అందించాడు.

మైకు విశ్వనాథంగారి ముందుంచారు. ఆయన గొంతు విప్పి చెబుతున్నారు.

"అవిటి వాళ్ళమని చచ్చిపోవడం లేదు. బ్రతుకుతూనే ఉన్నాం. ఎలాగో తింటూనే ఉన్నాం. మన బ్రతుకుల్ని మనం బండో బరువో ఎలాగోలాగ ఈడ్చుకుంటున్నాం. అయితే మన కష్టాలను ఇతరులు రవంత గుర్తించి మన ఎడల కించిత్ సానుభూతి అవగాహనా చూపి మన మనుగడని గుర్తిస్తే మన కదే పదివేలు. సమాజానికి మన మెవరమూ గుదిబండలం కాకూడదనే విన్నపం...ప్రజాస్వామ్యం మనం ఏరి కోరి తెచ్చుకున్నాం, సంక్షేమ రాజ్యం కట్టుకున్నాం. ప్రజా ప్రభుత్వం కాగితాల మీద నుంచి, వేదికల మీది నుంచీ దిగి మన మనుషుల్లోకి, మనుష్యుల మనసులలోకి రావాలి. అది వస్తోందనడానికిదే నిదర్శనం. ఈ సంతోషం మీ అందరితో పంచుకుంటున్నాను. నాకింత వయసొచ్చింది...బ్రతుకంతా అవిటి వాడిని కాను...కాని ఈ రోజు, ఈ క్షణం నా బాధ ఏ నాడూ నేను పడనంత బాధ. ఇంతమంది బాధపడుతున్న వాళ్ళిక్కడే ఉన్నారని నాకు తెలియదు...

మిమ్మల్ని చూస్తుంటే నాకు మనస్సు తరుక్కుపోతోంది...ప్రభుత్వ మన్నది ఒక ఊహ. ఒక భావన - ఒక యాబ్‌స్ట్రాక్షన్ అంటారు దొరలు - అదేకాదు. ప్రభుత్వం అంటే మనుషులు. ప్రభుత్వమంటే అధికారులు కారు. ఎందుచేతనంటే ఎంతటి అధికారయినా ముందు మనిషి తరువాతే అధికారి...అవిటి వాళ్లని చూసి జాలిపడి మనం చెయ్యగలిగిన పనులు మనకు ఇవ్వాలి. దేశమంటే మాకూ భక్తి ఉంది. మేం చెయ్యగలిగినదీ మమ్మల్ని చెయ్యనివ్వండి. పని ఇయ్యమనే మనం అడుగుదాం, బిచ్చం వెయ్యమని కాదు. ఆ దశకు అతీతంగా బ్రతకాలనే మా కంటె బాధపడే మనుషులకు అండగా ఉండాలనే మా ఆవేదన మనందరి ఆవేదనా, మాకు అందరిలాగే జీవించాలని ఆశ ఉంది...మా మనసులు అవిటిని కావు..."

తెలుగు కష్టపడి నేర్చుకున్న పంజాబీ కలెక్టరుగారు ముందుకు వంగి వింటున్నారు. పెన్ను తీసి కాగితం మీద ఏదో రాశారు. వెనక నుంచి తాసిల్దారు గారు కాబోలు ఓ ఫైలు అందించాడు. కలెక్టరుగారు మరేదో రాశారు...తాసిల్దారు గారికి చెమట పడుతోంది. విశ్వనాథంగారు మాట్లాడడం ముగిస్తున్నారు.

"మమ్మల్ని మనుష్యులుగా గుర్తించాలనుకున్న సమాజానికీ, ఆ సమాజం ఏర్పరచుకొన్న ప్రభుత్వానికీ, దానిని నడుపుతున్న అధికారులకీ, అధికారంలో ఉన్న మనుష్యులకీ మా అందరి తరపునా ధన్యవాదాలు చెబుతూ నా కిచ్చిన అవకాశానికి కృతజ్ఞత చెప్పుకుంటూ శెలవు..."

మైక్ వేదిక మీదకు వెళ్లింది.

కలక్టరుగారు ముందు విశ్వనాధంగారి పేరే పిలిచారు. ఓ పదిమంది ఆయనను సాదరంగా వేదిక మీదకు చేర్చారు.

విశ్వనాధంగారు స్వయంగా తన చేతులతో నడుపుకోగలిగే మూడు చక్రాల సైకిలుకు అమర్చిన కుర్చీ.

ప్రభుత్వం దానిని ఆయనకు అందిస్తున్న కానుకగా కలెక్టరుగారు దానిని అభివర్ణించారు. ఆయన సొంతంగా చెయ్యి ఊత నిచ్చి విశ్వనాధంగారిని కుర్చీ బండీ మీద కూర్చోబెట్టారు. వెనకాల అందరూ నుంచొని ఫొటోగ్రాపర్ వంక చూస్తున్నారు. మునిసిపల్ కమీనర్‌గారు విశ్వనాధంగారి భార్యను ఫొటోలోకి రమ్మన్నారు.

"ఇదేదో సన్మానంలా చేశారోయ్! దానం పట్టినట్టులేదు నాకు "- ఇంటికి వస్తూ అన్నారు- విశ్వనాధంగారు.

ప్రసాద్ ఇంటికి వచ్చి తన మూస వంక చూసుకొని ఆలోచనలో పడ్డాడు. రాయాలనిపించిన మాట నిజం...రాయాలనిపించిన తరువాత....రాసింది వేరు....

రచయితగా సామాజిక నిస్పృహలోకి ఎదిగి - కాకపోతే మేల్కొని - మరుసటిరోజు మరో విషయం తెలుసుకున్నాడు.

సొంతంగా నడుపుకునే సైకిలు కుర్చీ అసలు ముందు ఎవరికి ఉద్దేశింపబడిందంటే...ఓ అంధుడికి...అదే తాసిల్దారుగారి తత్తరపాటుకీ, చలికాలంలో చెమటకీ కారణం...కలెక్టరుగారు దాన్ని అక్కడికక్కడ మార్పు చేసి విశ్వనాధంగారికి ఇచ్చారు.

తాసిల్దారు వెనుక కథలోకి వెళ్లదలుచుకోలేదు ప్రసాద్-సామాజిక నిస్పృహలోకి జారిపడిపోడం ఇష్టంలేక.

ఆంధ్ర సచిత్రవారపత్రిక 17.9.1982